## నాలుగో రోజు మూడు నామినేషన్లు

నల్లగొండ, ఫిబ్రవరి 6 : వరంగల్-ఖమ్మం-నల్లగొండ ఉపాధ్యాయ శాసన మండలి నియోజక వర్గానికి జరుగనున్న ఎన్నికల్లో భాగంగా గురువారం నాలుగో రోజు ముగ్గురు అభ్యర్థులు నామినేషన్లు వేశారు. గురువారం నామినేషన్లు వేసిన వారిలో ప్రజావాణి పార్టీ నుంచి లింగిడి వెంకటేశ్వర్లు ఒక సెట్, స్వతంత్ర అభ్యర్థులుగా అర్వ స్వాతి, చాలిక చంద్రశేఖర్ చెరో నామినేషన్ జిల్లా కలెక్టర్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఇలా త్రిపాఠికి దాఖలు చేశారు. తొలి రోజు ఒక నామినేషన్, రెండో రోజు నిల్, మూడో రోజు రెండు నామినేషన్లు వచ్చాయి. ఈ నెల 3 నుంచి ఇప్పటి వరకు ఆరుగురు అభ్యర్థులు ఏడు సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. ఈ నెల 10వరకు నామినేషన్ల స్వీకరణ కొనసాగనుంది. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్, అసిస్టెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

# కుల గణనపై బడుగుల ఫైర్

## సక్రమంగా చేపట్టాలని డిమాండ్

- బీసీల వాస్తవ జనాభా తేల్చాలని పట్టు
- కాంగ్రెస్ ప్రభుత్వ మోసంపై పోరుబాట
- రేవంత్ సర్కార్‌ను హెచ్చరిస్తున్న బీసీ సంఘాల నేతలు
- చట్టసభల్లో 42శాతం రిజర్వేషన్లు కల్పించాలని స్పష్టీకరణ



నల్లగొండ ప్రతినిధి, ఫిబ్రవరి 6 (నమస్తే తెలంగాణ) : కుల గణన నివేదికను తప్పుల తడకగా రూపొందించడంతోపాటు ఉద్దేశపూర్వకంగానే బీసీ జనాభాను తక్కువ చేసి చూపారని ఉమ్మడి జిల్లావ్యాప్తంగా బీసీ సంఘాలు, ప్రజా సంఘాలతోపాటు సామాజికవేత్తలు మండి పడుతున్నారు. ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన సర్వే గణంకాలపై క్షేత్రస్థాయిలో తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం ఎన్నికల్లో చట్టబద్ధంగా 42 శాతం రిజర్వేషన్లు కాకుండా పార్టీ పరంగా ఇస్తామనడం బీసీలను దగా చేయడమేనని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కేంద్రం పరిధిలోకి రిజర్వేషన్ల అంశాన్ని నెట్టి చేతులు దులుపుకొనేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధపడడం తగదంటున్నారు. కుల గణనలో దొర్లిన తప్పులను సరిదిద్దడానికి ప్రభుత్వం ప్రయత్నించకుండా కుంటి సాకులు చెప్పడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. అన్ని వర్గాల జనాభా పెరిగి కేవలం బీసీ జనాభా మాత్రమే తగ్గడం అంటే.. ఏదో మతలబు దాగి ఉందని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తప్పుల మీద తప్పులు చేస్తూ ఒక తప్పును కప్పిపుచ్చుకోవడానికి 100 తప్పులకు పాల్పడుతున్నదని బీసీ సంఘాల నేతలు ఆరోపిస్తున్నారు. బీసీలను మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వ నిర్వాకం పట్ల ఉమ్మడి జిల్లాలో పలుచోట్ల ఆయా సంఘాలు ఆందోళనలు కొనసాగుతున్నాయి. ఇప్పటికే పలుచోట్ల కులగణన నివేదికలను దగ్గం చేసి ఆగ్రహం వ్యక్తం చేశారు. కొన్ని చోట్ల బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సమావేశమై ప్రభుత్వ తీరును ఖండిస్తున్నారు. కుల గణన సర్వేను అసమగ్రంగా చేపట్టి బీసీకు అన్యాయం చేస్తున్నారని, తక్షణమే సమగ్ర సర్వే చేపట్టి వాస్తవమైన బీసీ జనాభాను వెలికితీయాలని డిమాండ్ చేస్తున్నారు. లేనిపక్షంలో రానున్న కాలంలో ప్రభుత్వంపై బీసీలంతా ఉప్పెనలా విరుచుకుపడుతామని హెచ్చరిస్తున్నారు.

### బీసీల జనాభా తగ్గడమేంటి?



గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన సమగ్ర కుటుంబ సర్వేలో 56 శాతం ఉన్న బీసీల జనాభా ఇప్పుడు 46శాతానికి ఎలా తగ్గుతుంది. బీసీలను అణగదొక్కడానికి కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే తప్పుడు సర్వే చేయించింది. మొదటి నుంచి కాంగ్రెస్ పార్టీ బీసీల వ్యతిరేకి. బీసీల ఎదుగుదలను ఎన్నడూ కూడా జీర్ణించుకోలేదు. కులగణన పేరుతో రేవంత్‌రెడ్డి సర్కారు ఏడాది పాటు డ్రామాలు ఆడింది. అగ్రకులాలను ఎక్కువ చూపించేందుకే కుల సర్వేను వాడుకున్నది. తప్పుల తడకగా ఉన్న కుల గణన మాకొద్దు. బీసీల పట్ల చిత్తశుద్ధి లేని కాంగ్రెస్ ప్రభుత్వానికి క్షేత్రస్థాయిలో బుద్ధి చెప్తాం.

**- అయిలీ లక్ష్మీనర్సింహ గౌడ్, తమ్మడపల్లి మాజీ సర్పంచ్, మర్రిగూడ**

### కాంగ్రెస్ పాలనలో బీసీలకు అన్యాయం



ఈ డబ్ల్యూఎస్ రిజర్వేషన్‌ను కాపాడే క్రమంలో బీసీల జనాభాను తక్కువ చేసి చూపించారు. ఇందులో బీసీ రిజర్వేషన్‌ను నీరుగార్చే కుట్ర దాగి ఉంది. 7శాతం ఉన్న ఓసీల సంఖ్యను రెట్టింపు చేసి చూపించి, బీసీ, ఎస్సీ, ఎస్టీల సంఖ్యను గణనీయంగా తగ్గించి చూపడం దుర్మార్గమైన చర్య. కుల గణన సర్వేలో జరిగిన తప్పులను సవరించి బీసీలకు న్యాయం జరిగే విధంగా ప్రభుత్వం చూడాలి.

**-పానగంటి విజయ్, బీసీ యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మునుగోడు**

### కుల గణన సర్వే ఆమోదయోగ్యం కాదు



కుల గణన సర్వేలో కాంగ్రెస్ ప్రభుత్వం బీసీల సంఖ్యను తక్కువ చేసి చూపిస్తున్నది. ప్రభుత్వం చేపట్టిన ఇంటింటి సర్వే ఆమోదయోగ్యం కాదు. బీసీ, మైనార్టీలతో కలుపుకొని 62 శాతం ఉన్న బీసీ జనాభాను రాష్ట్ర ప్రభుత్వం 56 శాతంగా చూపుతూ అన్యాయం చేస్తున్నది. కుల గణన సర్వే పూర్తి కాకుండానే కాంగ్రెస్ మంత్రులు లెక్కలు ప్రకటించడం అమానుమానాలను రేకెత్తిస్తున్నది. బీసీ రిజర్వేషన్లపై అసెంబ్లీ నిర్వహిస్తున్నామని రాష్ట్ర ప్రభుత్వం హైడ్రామా ఆడుతున్నది. ప్రజాపాలన పేరిట ప్రజలను మోసం చేస్తున్న కాంగ్రెస్ పార్టీకి రానున్న ఎన్నికల్లో ఓట్లతో బుద్ధి చెప్పడం ఖాయం.

**-రాచకొండ శ్రీనివాస్‌గౌడ్, మాజీ మున్సిపల్ చైర్మన్, నకిరేకల్**

### బీసీలను అణచివేసే విధంగా కుల గణన సర్వే



ప్రభుత్వం ప్రకటించిన కుల గణన బీసీలను అణచివేసే విధంగా ఉంది. ప్రభుత్వం ప్రకటించిన కుల గణన సర్వేలో బీసీలను తగ్గించి చూపడంతో తీవ్ర గందరగోళం నెలకొంది. బీసీ జనాభాను తక్కువగా చూపించడంతో వారి రాజకీయ హక్కులను దెబ్బతీసే విధంగా ఉంది. సర్వే ఫలితాలను వెంటనే సమీక్షించి పారదర్శకతతో నిజమైన గణాంకాలను వెల్లడించాలి.

**- యర్కల మల్లేశ్ గౌడ్, జిల్లా బీసీ రాజ్యాధికార సమితి కో కన్వీనర్, కట్టంగూర్**

### బీసీలను రాజకీయంగా దెబ్బ తీసే కుట్ర



రేవంత్‌రెడ్డి సర్కారు చేసిన బీసీ కులగణన అంతా ఒక బూటకం. అగ్రకులాల సంఖ్యను రెట్టింపుగా చూపేందుకే సర్వేను వాడుకున్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీల సంఖ్యను గణనీయంగా తగ్గించడం హేయమైన చర్య. గత 10సంవత్సరాల నుంచి బీసీల సంఖ్య పెరుగకపోవడం ఆశ్చర్యానికి గురిచేసింది. బీసీలను రాజకీయంగా దెబ్బతీసేందుకే కాంగ్రెస్ పార్టీ కుట్ర పన్నింది. ప్రభుత్వం చేసిన నిర్వాకంతో బీసీలు సామాజికంగా, రాజకీయంగా వెనుకబాటుకు గురయ్యే ప్రమాదం ఉంది. ప్రభుత్వం దిద్దుబాటు చర్యలు చేపట్టి బీసీల పట్ల చిత్తశుద్ధిని చాటుకోవాలి.

**-చెర్కు లింగం గౌడ్, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు, మర్రిగూడ**

### బీసీలకు ద్రోహం చేసిన రేవంత్ సర్కార్



కుల గణన తప్పుడు రిపోర్ట్‌తో బీసీల జనాభా శాతాన్ని తక్కువ చేసి రేవంత్‌రెడ్డి సర్కార్ బీసీలను మోసం చేస్తున్నది. కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన కులగణన సర్వే పూర్తిగా లోపభూయిష్టంగా ఉంది. స్వయంగా కాంగ్రెస్ ఎమ్మెల్సీనే ఈ సర్వేను వ్యతిరేకించారు. బీసీలకు రిజర్వేషన్ల ఆశ చూపి ఇప్పుడు జనాభా శాతాన్ని తక్కువ చేసి చూపించారు. దీన్ని బట్టి బీసీల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎంత చిత్తశుద్ధి ఉందో అర్థమవుతున్నది. సీఎం రేవంత్‌రెడ్డి మాటలను ఇక బీసీలు నమ్మరు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్తారు.

**- చిర్ర మల్లయ్యయాదవ్, మాజీ సర్పంచ్, వేములపల్లి**

### కుల గణన బూటకపు సర్వే



రాష్ట్రంలో నిర్వహించిన బీసీ కులగణన సర్వే పూర్తిగా బూటకం. 2014 సంవత్సరంలో నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వేలో 51శాతంగా ఉన్న బీసీల సంఖ్యను ప్రస్తుతం ప్రభుత్వం 46శాతానికి కుదించింది. అగ్రకులాల సంఖ్యను రెట్టింపు చేసి బీసీ, ఎస్సీ, ఎస్టీల సంఖ్యను గణనీయంగా తగ్గించి చూపడం హేయమైన చర్య. బీసీలంతా దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నారు. రాష్ట్రంలో నడిచేది ప్రజాపాలన కాదు.. రెడ్డి పాలన.

**-జనిగల శ్రీనివాస్‌గౌడ్, బీసీ సంక్షేమ సంఘం నాయకుడు, గరిడేపల్లి**

### సక్రమంగా చట్ట బద్ధత కల్పించాలి



ప్రభుత్వం చేపట్టిన కులగణన ఆధారంగా బీసీలకు పార్టీపరంగా రిజర్వేషన్లు ప్రకటించొద్దు. ప్రభుత్వ పరంగా చట్టబద్ధత కల్పించి 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలి. నాడు ఎన్నికల ప్రచారంలో భాగంగా కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో చెప్పిన విధంగా అమలు చేయాలి. అలా కాకుండా బీసీ కులగణన నివేదికను కేంద్రానికి పంపి వదిలేయడం సరికాదు. రిజర్వేషన్లు చట్టబద్ధత చేస్తేనే బీసీలకు న్యాయం జరుగుతుంది.

**-పగిడి జీడయ్య యాదవ్.. బీసీ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, దామరచర్ల**

### కులగణన అంతా తప్పుల తడక



రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కుల గణన సర్వే అంతా తప్పుల తడకగా ఉంది. రాష్ట్రంలో 60శాతానికిపైగా ఉన్న బీసీ జనాభాను కాంగ్రెస్ ప్రభుత్వం 46శాతంగా చూపెట్టి మోసం చేస్తున్నది. రేవంత్‌రెడ్డి సర్కారు కుల గణన సర్వేలో జరిగిన తప్పులను సవరించి బీసీలకు న్యాయం జరిగే విధంగా చూడాలి.

**-బొల్లెపెల్లి స్వామిగౌడ్, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, ఎన్జీ కొత్తపల్లి, శాలిగౌరారం మండలం**



మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డిని కలిసిన బీఆర్ఎస్ హుజూర్‌నగర్ నాయకులు

## మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డికి జాతర ఆహ్వానం

మేళ్లచెర్వు, ఫిబ్రవరి 6 : మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డిని బీఆర్ఎస్ హుజూర్‌నగర్ నియోజకవర్గ సమన్వయకర్త ఒంటెద్దు నరసింహారెడ్డి ఆధ్వర్యంలో ఆ పార్టీ నేతలు గురువారం కలిశారు. గురువారం సూర్యాపేటలోని క్యాంపు కార్యాలయానికి వెళ్లి ఈ నెలాఖరున మేళ్లచెర్వులో జరుగనున్న మహాశివరాత్రి జాతరకు రావాలని ఆహ్వానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు శంకర్‌రెడ్డి, బాలవెంకట్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, శంభిరెడ్డి, ఇమ్రాన్, జానీ ఉన్నారు.



నర్సిరెడ్డిగూడెంలో ఆందోళన వ్యక్తం చేస్తున్న నిర్వాసితులు

## ముంపు గ్రామంపై ముప్పేట దాడి

- అందరికీ పరిహారం చెల్లించకుండానే నర్సిరెడ్డిగూడేన్ని ఖాళీ చేయించేలా కాంట్రాక్టర్, అధికారుల ఒత్తిడి
- గ్రామంలో ఆందోళన.. కట్టపై టిప్పర్లను అడ్డుకొని పనుల నిలిపివేత

మర్రిగూడ, ఫిబ్రవరి 6 : మండలంలోని శివన్నగూడెం ప్రాజెక్టు ముంపు గ్రామమైన నర్సిరెడ్డిగూడెం బాధితులను ఖాళీ చేయించేందుకు ప్రాజెక్టు కాంట్రాక్టర్, ఇరిగేషన్ శాఖ అధికారులు కలిసి గ్రామస్తులపై ముప్పేట దాడి చేస్తున్నారు. ఇండ్లను ఖాళీ చేయాలని ప్రాజెక్టు యాజమాన్యం, అధికారులు గురువారం గ్రామానికి ట్రాక్టర్లు పంపించడంతో ప్లాట్లు, పరిహారం అందని నిర్వాసితులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం పనులు జరుగుతున్న ప్రాజెక్టు కట్ట దగ్గరికి వెళ్లి టిప్పర్లను అడ్డుకొని పనులు నిలుపుదల చేశారు. కట్టపై బైఠాయించి ఆందోళన చేశారు. ఈ సందర్భంగా మంపు బాధితులు మాట్లాడుతూ ఈ నెల 10వరకు గ్రామాన్ని ఖాళీ చేయించేలా అధికారులు తీవ్ర ఒత్తిడి చేస్తున్నారని తెలిపారు. అందులో భాగంగానే రాత్రిపూట విద్యుత్ స్తంభాలను కూల్చేసి భయాందోళన సృష్టించారని చెప్పా రు. గ్రామాన్ని ఖాళీ చేసిన వారికి కాంట్రాక్టర్‌తో మాట్లాడి నజరానా కూడా ఇప్పిస్తామని అధికారులు మధ్యవర్తిత్వం వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామస్తుల మధ్య ఐక్యతను దెబ్బతీసేలా కట్రలు చేస్తున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. సర్వస్వం కోల్పోతున్న భూ నిర్వాసితుల పట్ల ప్రభుత్వం కర్కశంగా వ్యవహరిస్తున్నదని మండిపడ్డారు. కనీసం నోటీసులు కూడా ఇవ్వకుం డా అధికారులు గ్రామంలోకి ట్రాక్టర్లను పంపి ఖాళీ చేయమనడం ఎం త వరకు కరెక్టు అని ప్రశ్నించారు. ఖాళీ చేయించే సమయంలో ప్రభు త్వ అధికారులు ఎందుకు గ్రామానికి రాలేదని నిలదీశారు. మిగిలిన నిర్వాసితులకు ప్లాట్లు, ఆర్అండ్ ఆర్ ప్యాకేజీ కింద పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. భూ నిర్వాసితులను భయపెడుతూ గ్రామాన్ని ఖాళీ చేయాలని చూస్తే ప్రతిఘటన తప్పదని హెచ్చరించారు.

### 10 తర్వాత ఖాళీ చేస్తే పైసలు ఇవ్వమని బెదిరింపులు

గ్రామస్తులను ఎలాగైనా ఖాళీ చేయించాలనే కుట్రతో అధికారులు, ప్రాజెక్టు యాజమాన్యంతో కుమ్మక్కైనట్లు బాధితులు ఆరోపించారు. 6న గ్రామాన్ని ఖాళీ చేసిన కుటుంబానికి రూ.30వేలు, 10లోపు ఖాళీ చేస్తే రూ.20వేల చొప్పున ఇప్పిస్తామని ఇరిగేషన్ అధికారులు ప్రలోభపెట్టినట్లు గ్రామస్తులు తెలిపారు. 10తర్వాత ఖాళీ చేసిన వారికి పైసా కూడా ఇవ్వబోమని, వారితో తమకెలాంటి సంబంధం లేదని చెప్పినట్లు వెల్లడించారు. వారి మాటలు విన్న కొందరు బాధితులు గ్రామాన్ని ఖాళీ చేయగా, మిగతావారు ఖాళీ చేసేది లేదని తేల్చిచెప్పారు.

### ప్లాట్లు ఇచ్చే వరకూ కదలం

గ్రామంలోని 289 ముంపు బాధితులకు గానూ చింతపల్లి మండలంలో లాటరీ ద్వారా 257 మందికి ప్లాట్లు కేటాయించారు. ఇంకా 32 మందికి ప్లాట్లు రాలేదని, ఇంకో 15మందికి ఆర్అండ్ఆర్ ప్యాకేజీ కింద నష్టపరిహారం అందాల్సి ఉంద ని బాధితులు వాపోయారు. అధికారులు ప్లాట్లను మాత్రమే కేటాయిం చి చేతులు దులుపుకొన్నారని, వాటి కి సంబంధించి డాక్యుమెంట్లు ఇవ్వలేదంటున్నారు. పూర్తిస్థాయిలో పునరావాసం కల్పించకుండా గ్రా మాన్ని ఖాళీ చేయించేందుకు ప్రభుత్వం కుట్ర చేస్తున్నట్లు మండిపడ్డారు.



నర్సిరెడ్డిగూడెంలో ఏడుస్తున్న భూ నిర్వాసితురాలు తోళ్కునూరి వెంకటమ్మ

### అర్హులందరికీ నష్టపరిహారం అందిస్తాం : ఈఈ రాములు

ఈ విషయమై ఇరిగేషన్ శాఖ ఈఈ రాములును వివరణ కోరగా 2021 మే 21లోగా గ్రామంలో డీఎల్ఐఎస్ నంబ ర్ పొందిన ముంపు బాధితుందరికీ ప్లాట్లు, ఆర్అండ్ఆర్ ప్యాకేజీ అందుతాయన్నారు. నిర్వాసితులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, మిగతా 32మందికి కూడా ప్లాట్లు ఇస్తామని తెలిపారు. ప్లాట్లు కేటాయించిన వారికి త్వరలోనే మంజూరు పత్రాలు అందిస్తామన్నారు. గ్రామాన్ని ఖాళీ చేయించేలా ఎవరినీ ఒత్తిడి చేయడం లేదని, ప్లాట్లు, ఆర్అండ్ఆర్ ప్యాకేజీ వచ్చిన వాళ్లు మాత్రమే ఇండ్లను ఖాళీ చేస్తున్నారని చెప్పారు.

# నీళ్లు లేక నెర్రెలు

## సూర్యాపేట జిల్లాలో ఎండుతున్న వరి పైర్లు


- కాళేశ్వరాన్ని గాలికి వదిలేయడంతోనే రైతులకు అవస్థలు
- నాట్ల సమయం నుంచి ఆందోళనలే
- ప్రభుత్వం స్పందించకపోతే 50 శాతం వరి కష్టమే

సూర్యాపేట, ఫిబ్రవరి 6 (నమస్తే తెలంగాణ) : సూర్యాపేట జిల్లా పరిధిలోని శ్రీరాంసాగర్ ఫేజ్-2 ఆయకట్టు రైతులు ఏడేండ్ల తరువాత కరువును ఎదుర్కొంటున్నారు. బీఆర్ఎస్ హయాంలో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి నీళ్లు రావడంతో జిల్లాలోని శ్రీరాంసాగర్ ఆయకట్టుకు ఎలాంటి అడ్డంకులూ లేకుండా ఇంచు భూమి వదలకుండా రైతులు వరి పండించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఏడాది నుంచి నీళ్ల కోసం అరిగోస తీస్తున్నారు. ఈ యాసంగి వరి నాట్లు వేసిన 20 రోజుల నుంచే ఎస్ఆర్ఎస్పీ కాల్వల్లో నీళ్లు రావడం లేదని, నాటేసిన వరి ఆదిలోనే ఎండిపోతుందని రైతులు ధర్నాలు, రాస్తారోకోలు చేస్తున్నారు. ఎస్ఆర్ఎస్పీ కింద సూర్యాపేట జిల్లాలో 2.95 లక్షల ఎకరాల్లో వరి ఆయకట్టు ఉండగా, నీళ్లు రావనే అనుమానంతో 2.50 లక్షల్లో నాట్లు పడ్డాయి. చాలాచోట్ల వానకాలంలో కురిసిన వర్షాలతో బావులు, బోర్లలో నీళ్లు ఉండడంతో నాట్లు వేసినప్పటికీ పంట చేతికి వచ్చే సమయానికి నీళ్లు అందకపోవచ్చని ఇరిగేషన్ శాఖ అధికారుల ద్వారా తెలిసింది. గతంలో కాళేశ్వరం పంపుల నుంచి వచ్చే నీళ్ల సపోర్ట్‌తోనే పంట చేతికి వచ్చే వరకు నీటిని ఇవ్వగలిగామని, ప్రస్తుతం నీటి నిల్వలు తక్కువ ఉన్నందున పూర్తిస్థాయిలో ఇవ్వడం కష్టమని చెబుతున్నారు. ఇలాగే కొనసాగితే ఈ యాసంగిలో ఎస్ఆర్ఎస్పీ ఆయకట్టు కింద 50 శాతం వరి ఎండిపోతే ప్రమాదం కనిపిస్తున్నది.

సూర్యాపేట జిల్లాలో ఎస్ఆర్ఎస్పీ ఆయకట్టు పరిధిలో కాల్వల ద్వారా నేరుగా నీళ్లు పారేది 2.50 లక్షల ఎకరాలు ఉండగా, ఆయకట్టు పరిధిలోని చెరువులు, కుంటల కింద మరో 45వేలు ఎకరాలు కలిపి మొత్తం 2.95 లక్షల ఎకరాల సాగు భూమి ఉంది. వ్యవసాయ శాఖ గణాంకాల ప్రకారం 2017 యాసంగి సీజన్‌లో సూర్యాపేట జిల్లాలోని ఎస్ఆర్ఎస్పీ ఆయకట్టులో కేవలం 17,500 ఎకరాల్లో వరి పండగా, 2018 నుంచి కాళేశ్వరం జలాలు రావడంతో 2019 నుంచి 2023 వరకు యాసంగి సీజన్‌లో వంద శాతం వరి పండించారు. గత ఎన్నికల్లో అలివికాని హామీలు ఇచ్చి, కేసీఆర్‌ను మించి ఏదో చేస్తామని నమ్మబలికి ఓట్లు వేయించుకున్న కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన అనతి కాలంలోనే రైతన్నల దుస్థితి దయనీయంగా మారింది. సూర్యాపేట జిల్లాలో ఉమ్మడి రాష్ట్రంలోని కరువు పరిస్థితులు కనిపిస్తున్నాయి. కుంటిసాకులతో చూపి కాళేశ్వరం ప్రాజెక్టును పడావు పెట్టడంతో గత యాసంగి సీజన్‌లో జిల్లాలో వేలాది ఎకరాల్లో వరి పైర్లు ఎండిపోయాయి. దాంతో దాదాపు ఏడేండ్ల తరువాత ప్రభుత్వంపై రైతన్నలు ఆందోళనలు, ప్రతిపక్షాల ఉమ్మడి రాష్ట్రంలో మాదిరి నిరసనలు పునరావృతం అయ్యాయి. ప్రస్తుతం యాసంగి నాట్లు 20 రోజుల నుంచి 45 రోజులు పూర్తి చేసుకోగా ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి. ఎస్ఆర్ఎస్పీ కాల్వల్లో నీళ్లు రాక నాటేసిన వరి ఎండిపోతున్నదని నిత్యం జిల్లాలో ఏదో ఒక చోట రైతులు ధర్నాలు, రాస్తారోకోలు చేస్తున్నారు.



మోతె మండలం భీక్యాతండాలో ఎండిపోయిన వరి పొలం



పెన్‌పహాహాడ్ మండలం మెగ్యాతండాలో పూర్తిగి ఎండిన వరి

### నాటిన నెల తిరగకముందు నుంచే ఎండుతున్న వరి

ఈ యాసంగి కోసం దుక్కులు దున్ని నాట్లు వేస్తున్న రైతాంగం తొలి దశలోనే నీళ్ల కోసం ధర్నాలు, రాస్తారోకోలు చేయాల్సిన దుస్థితి దాపురించింది. ఎస్ఆర్ఎస్పీ కాల్వల నుంచి ఆన్ అండ్ ఆఫ్ పద్ధతిన వారంపాటు నీటిని విడుదల చేస్తుండగా సగం పొలాలకు కూడా చేరుకోవడం లేదు. వారం పాటు నీటిని విడుదల చేయడం, అది కూడా గత బీఆర్ఎస్ హయాంలో 1,800 క్యూసెక్కులు రాగా, ప్రస్తుతం 1,200కి మించి ఇవ్వడం లేదు. దాంతో పారిన చోటే నీళ్లు పారుతున్నాయి తప్ప వెనుక భూములకు అందడం లేదు. తుంగతుర్తి నియోజకవర్గం పరిధిలోని అర్వపల్లి, నాగారం, తుంగతుర్తి, మద్దిరాల, నూతనకల్ మండలాలతోపాటు సూర్యాపేట నియోజకవర్గం పరిధిలోని సూర్యాపేట, చివ్వెంల, పెన్‌పహాడ్, కోదాడ నియోజకవర్గం పరిధిలోని నడిగూడెం, మునగాల మండలాల్లో దాదాపు 35 శాతం వరకు కాల్వల్లో నీళ్లు పారడం లేదు. ఇప్పటికే వేసిన వరి ఎండిపోతూ మేకలు, పశువులకు మేత అవుతున్నది. కాల్వల్లో నీళ్లు రావడం లేదని, వేసిన నాట్లు ఎండిపోతున్నాయని కాల్వలు, ఎండిపోతున్న పైర్ల వద్ద, రోడ్లపైన రైతులు ధర్నాలు చేస్తున్నారు.

### మేల్కొకకపోతే 50 శాతం పంట నష్టం

కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికైనా పట్టింపులు మాని కాళేశ్వరం పంపులను ఆన్ చేసి ప్రస్తుతం ఉన్న ఎస్ఆర్ఎస్పీ జలాలకు సపోర్ట్ ఇవ్వకపోతే జిల్లాలో భారీ నష్టం వాటిల్లే ప్రమాదం ఉంది. ఎస్ఆర్ఎస్పీలో నీటి నిలువ తక్కువ ఉండగా ఇప్పటికే జిల్లాకు 1,200 క్యూసెక్కులకు మించకుండా ప్రవాహం వస్తున్న నేపథ్యంలో మరి కొద్ది రోజుల్లో నీటి ప్రవాహం మరింత పడిపోతుందని ఇరిగేషన్ అధికారుల ద్వారా తెలిసింది. ప్రస్తుతం ప్రతి మండలంలో దాదాపు 5 శాతం పంటలు పూర్తిగా ఎండిపోగా మరో 10 శాతానికిపైనే ఇప్పుడిప్పుడే ఎర్రబారుతున్నాయి. వారం రోజుల నుంచి ఎండలు ముదురుతుండడం, కాల్వల్లో నీటి ప్రవాహం తగ్గుతుండడం పట్ల ఇప్పటికే పంటలు ఎండిపోతున్నాయి. ఈ సీజన్ పూర్తయ్యే నాటికి 50 శాతానికి పైనే వరి పైర్లు ఎండిపోయే ప్రమాదం కనిపిస్తున్నది. వరి పంటకు నీళ్లివ్వలేని పరిస్థితిని ముందస్తుగానే గుర్తించి ప్రణాళికలు సిద్ధం చేసి ఇతర పంటలు వేయాలని రైతులను సిద్ధం చేయడంలో ప్రభుత్వం విఫలమైంది. నీటి నిల్వల ఆధారంగా కేసీఆర్ నియమించిన ఏఈఓలు గ్రామాల్లోనే ఉన్నందున పంటల మార్పిడి చేపట్టడం, వరి వేస్తే నీరందదని ప్రచారం చేస్తే రైతులకు కొంత నష్టం తప్పేది. ఇప్పటికైనా ప్రభుత్వం కాళేశ్వరం పంపులను ఆన్ చేసి నీటిని విడుదల చేస్తే నాటేసిన వరి చేతికి అందుతుంది.

### నీళ్లు చాలక పొలం ఎండిపోతున్నది



నాకు దుబ్బతండ గ్రామ శివారులో ఎస్సారెస్పీ కాల్వ కింద నాలుగు ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. ఐదారేండ్లుగా వానకాలం, యాసంగి సీజన్‌లో నీళ్లు ఇవ్వడంతో మొత్తం నాలుగు ఎకరాలు సాగు చేశాను. ఒక్క సీజన్‌లో కూడా ఎండకుండా పంట చేతికొచ్చింది. గతంలో కూడా ఆన్ అండ్ ఆఫ్ పద్ధతిలో నీళ్ళు ఇచ్చారు. దాంతోపాటు చెరువులు, కుంటలు నింపడంతో సమస్య ఉండేది కాదు. ఇప్పుడు రెండు ఎకరాలే నాటు పెట్టినా, నీళ్లు చాలక పొలం ఎండిపోతున్నది.

**- భూక్యా రావూజీ, రైతు, మహ్మదాపురం ఆవాసం లాల్‌సింగ్‌తండా, పెన్‌పహాడ్**



సూర్యాపేట మున్సిపల్ కార్యాలయం ముందు ఖాళీ బిందెలతో ధర్నా చేస్తున్న మహిళలు

## మంచి నీటి కోసం ఖాళీ బిందెలతో ధర్నా

సూర్యాపేట టౌన్, ఫిబ్రవరి 6 : మంచి నీళ్లు రావడం లేదని నెలల తరబడి మొర పెట్టుకుంటున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆగ్రహించిన మహిళలు ఖాళీ బిందెలతో ఆందోళనకు దిగారు. సూర్యాపేట మున్సిపాలిటీలోని 5వ వార్డు తెల్లబండతండాకు చెందిన మహిళలు గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ముందు ఖాళీ బిందెలతో ధర్నా చేశారు. తండాకు మంచి నీళ్లు అందించే మిషన్ భగీరథ పైప్‌లైన్ కొద్దిగా పగలడంతో ఎనిమిది నెలల నుంచి నీళ్లు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపల్ అధికారులకు విన్నవించినా ప్రతిసారీ మూడ్రోజుల్లో నీళ్లు వస్తామంటూ సమస్యను దాటవేస్తున్నారని మండిపడ్డారు. దాంతో దూర ప్రాంతాలకు నడిచి వెళ్లి మంచి నీళ్లు తెచ్చుకుంటున్నామని వాపోయారు. కేసీఆర్ ఉన్నన్ని రోజులు నీళ్లకు ఢోకా లేదని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించకపోతే పెద్దఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు.

కార్యక్రమంలో తండాకు చెందిన మహిళలు పసుపుల పాపమ్మ, పల్లపు రేణుక, స్వర్ణ, కృష్ణ, తిరుపతమ్మ, యశోద, గాదె లక్ష్మి, కనకమహాలక్ష్మి, విజయలక్ష్మి, నాగమణి, సారమ్మ, వెంకటమ్మ పాల్గొన్నారు.

## మఠంపల్లిలో ఇనుప యుగం ఆనవాళ్లు

- మఠంపల్లి మండలంలో క్రీ.పూ వెయ్యి ఏండ్లనాటి నిలువు రాయి

మఠంపల్లి, ఫిబ్రవరి 6 : సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలంలో ఇనుప యుగపు ఆనవాళ్లు ఉన్నాయని పురావస్తు పరిశోధకుడు, ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ సీఈఓ డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి తెలిపారు. కొత్త తెలంగాణ చరిత్ర బృందం సభ్యులు అహోబిలం కరుణాకర్, నసీరుద్దీన్, చంటి ఇచ్చిన సమాచారం మేరకు గురువారం మఠంపల్లి పాత శివాలయం బజారులోని పీర్లచావిడి దగ్గర 12 అడుగుల ఎత్తు, 5 అడుగుల వెడల్పు, 6 అంగుళాల మందం ఉన్న నిలువురాయి(స్మారక శిల)ను పరిశీలించారు. ఈ సందర్భంగా శివనాగిరెడ్డి మాట్లాడుతూ మఠంపల్లి క్రీస్తు పూర్వం వెయ్యి ఏండ్ల నాటి ఇనుపయుగపు స్థావరమన్నారు. ఆ కాలంలో మరణించిన వారిని ఒక గుంటలో పూడ్చి పైన మట్టితో కప్పి గుర్తుగా ఒక స్మారక శిలను నిలిపే ఆచారం ఉండేదని, అందులో భాగంగానే ఈ నిలువురాయిని ఇక్కడ ఏర్పాటు చేసి ఉండవచ్చుని తెలిపారు. చారిత్రక ప్రాధాన్యం గల ఈ నిలువు రాయిని కాపాడుకోవాలని మఠంపల్లి గ్రామస్తులకు సూచించారు. పరిశోధనకు సహకరించిన బార్ కౌన్సిలర్ అధ్యక్షుడు, హైకోర్టు అడ్వకేట్ సాముల రామిరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.



మఠంపల్లిలో క్రీ.పూ వెయ్యేండ్ల నాటి నిలువు రాయిని పరిశీలిస్తున్న పురావస్తు పరిశోధకుడు, ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ సీఈఓ డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి